## 3,34,227 కుటుంబాల్లో సర్వే పూర్తి: అదనపు కలెక్టర్

ఎన్యుమరేటర్‌కు కుటుంబ వివరాలు అందజేస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

కలెక్టరేట్, డిసెంబర్ 1: జిల్లాలో ఇప్పటి వరకు 3,34,227 కుటుంబాల్లో సమగ్ర ఇంటింటి సర్వే పూర్తి చేసినట్లు అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ తెలిపారు. పట్టణాల్లో 1,21,320 కుటుంబాల్లో, గ్రామీణ ప్రాంతాల్లో 2,12,957 కుటుంబాల్లో ఇప్పటి వరకు సర్వే చేపట్టినట్లు వెల్లడించారు. సర్వే తీరుతెన్నులను కలెక్టర్ పమేలా సత్పతి నిత్యం పర్యవేక్షిస్తుండగా, మున్సిపల్ పరిధిలో కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నట్లు పేర్కొన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధుల వివరాలు కూడా సర్వేలో భాగంగా సేకరించినట్లు ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో స్పష్టం చేశారు. గ్రామాలు, వార్డుల్లో సేకరించిన వివరాలను మున్సిపల్, మండల కేంద్రాల్లోని తహసీల్, ఎంపీడీవో కార్యాలయాల్లో డాటా ఎంట్రీ ఆపరేటర్లు ఆన్‌లైన్‌లో నమోదుచేస్తున్నారని, సర్వే సిబ్బందిని కూడా ఈ ప్రక్రియలో భాగస్వాములను చేస్తున్నామని పేర్కొన్నారు. ఆన్‌లైన్ ప్రక్రియ ముగిసిన వెంటనే ప్రభుత్వానికి నివేదిక అందించనున్నట్లు అదనపు కలెక్టర్ తన ప్రకటనలో వెల్లడించారు.

***ప్రజాప్రతినిధులు, అధికారుల ఇళ్లల్లో సర్వే***

జిల్లాలోని ఆయా ప్రాంతాల్లో పలువురు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల ఇళ్లల్లో ఆదివారం ఎన్యుమరేటర్లు సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించారు. మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, కరీంనగర్ ఎంపీ, కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, కలెక్టర్ పమేలా సత్పతి, అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్ నివాసాలకు వెళ్లిన ఎన్యుమరేటర్లు వారి నుంచి వివరాలు సేకరించి, సర్వే ఫారాల్లో నమోదు చేశారు.

## కాంగ్రెస్‌పై కరీంనగర్ బీజేపీ 'చార్జిషీట్'

విద్యానగర్, డిసెంబర్ 1: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని బీజేపీ జిల్లా శాఖ ఆదివారం కాంగ్రెస్‌పై చార్జిషీట్ విడుదల చేసింది. నగరంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, పార్టీ శ్రేణులతో కలిసి చార్జిషీట్ కరపత్రాన్ని విడుదల చేసి మాట్లాడారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలు అన్ గ్యారెంటీగా మారాయని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ఏడాది పాలనపై ప్రజలు వ్యతిరేకతతో ఉంటే, విజయోత్సవ సభలు నిర్వహించుకోవడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో మాజీ జిల్లా అధ్యక్షుడు బాస సత్యనారాయణ రావు, జిల్లా ప్రధాన కార్యదర్శులు తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, మాడ వెంకట్ రెడ్డి, పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్ రావు, నాయకులు పాల్గొన్నారు.

## కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ముకరంపుర, డిసెంబర్ 1: విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రాచకొండ వెంకటేశ్వరరావు, నలువాల స్వామి డిమాండ్ చేశారు. నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో జిల్లా కార్యదర్శి రాచకొండ శ్రీనివాస్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన కరీంనగర్ టౌన్, రూరల్ డివిజన్ మహాసభలో వారు ముఖ్యఅతిథులుగా పాల్గొని పలు సమస్యలపై మాట్లాడారు. ఇక్కడ నాయకులు, తదితరులు ఉన్నారు.

## జిల్లా వైజ్ఞానిక ప్రదర్శనను సందర్శించిన డీఈవో

సెమినార్‌లో పాల్గొన్న డీఈవో జనార్దన్‌రావు

కొత్తపల్లి, డిసెంబర్ 1: విద్యార్థులు సైన్స్ ఫెయిర్‌లో నేర్చుకున్న విషయాలను నిత్య జీవితంలో అన్వయించుకోవాలని డీఈవో జనార్దన్‌రావు సూచించారు. కొత్తపల్లిలోని సెయింట్ జార్జ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో రెండు రోజులుగా జరుగుతున్న బాలల జిల్లా వైజ్ఞానిక ప్రదర్శనను డీఈవో ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ప్రతి విద్యార్థితో ముచ్చటించారు. విద్యార్థులు చేసిన మోడల్స్‌ను పరిశీలించి, అవి ఎలా పనిచేస్తాయో అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుంచి సుమారు 1,150 మంది ఈ ప్రదర్శనలను తిలకించారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి చాడ జయపాల్ రెడ్డి, విద్యా సంస్థల అధినేత ఫాతిమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 7 నుంచి గ్రామస్థాయిలో సీఎం కప్ క్రీడలు: డీవైఎస్‌వో

కొత్తపల్లి, డిసెంబర్ 1 : ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సీఎం కప్ క్రీడలను జిల్లాలో విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి బి. శ్రీనివాస్‌గౌడ్ కోరారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ స్టేడియంలో జిల్లా క్రీడాశాఖ, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్లు సంయుక్తంగా సీఎం కప్ క్రీడల కోఆర్డినేషన్ సమావేశాన్ని నిర్వహించాయి. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈనెల 7వ తేదీ నుంచి గ్రామస్థాయిలో సీఎం కప్ క్రీడలు ప్రారంభం కానున్నాయని, 10 నుంచి మండల స్థాయి, 16 నుంచి జిల్లా స్థాయిలో క్రీడా పోటీలు ప్రారంభమవుతాయని వెల్లడించారు. జిల్లా క్రీడా సంఘాల అధ్యక్ష కార్యదర్శులు, పీడీలు ప్రతిభ గల క్రీడాకారులను ఎంపిక చేయాలన్నారు. జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ, ఈ క్రీడలకు రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన నిధులు సరిపోకపోతే ఆయా ప్రాంతాల్లోని క్రీడా పోషకుల ద్వారా నిధులను సేకరించుకొని క్రీడలను విజయవంతం చేయాలన్నారు. గ్రామస్థాయి నుంచి యువత ఈ క్రీడా పోటీల్లో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలన్నారు. సీఎం కప్ పోర్టల్‌లో క్రీడల్లో పాల్గొనే ఆసక్తిగల క్రీడాకారులందరూ తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో పలు క్రీడా సంఘాల బాధ్యులు కె. వేణుగోపాల్, టి. రమేశ్ రెడ్డి, ఎన్ సిద్ధారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ టెక్నికల్ ఆఫీసర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

నూతన కార్యవర్గ సభ్యులను సన్మానిస్తున్న ఉద్యోగ సంఘ నాయకులు

తిమ్మాపూర్, డిసెంబర్ 1: సాగునీటి పారుదల శాఖలో తెలంగాణ టెక్నికల్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎల్ఎండీలోని గెస్ట్‌హౌస్‌లో ఆదివారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఉద్యోగులు ఎన్నుకున్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకటరాజిరెడ్డి నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. అధ్యక్షుడిగా ఇటిక్యాల చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శిగా నెర్నాల గంగయ్య, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా ఉయ్యాల రవి ఎన్నికయ్యారు. అంతకుముందు సంఘం తాజామాజీ అధ్యక్షుడు సయ్యద్ అసద్ ఉద్యోగ విరమణ కార్యక్రమం నిర్వహించి, అసద్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమాల్లో ఉద్యోగ సంఘాల నాయకులు వెంకటరత్నం, దారం శ్రీనివాస్ రెడ్డి, సంగెం లక్ష్మణ్‌రావు, పోలు కిషన్ తదితరులు పాల్గొన్నారు.

## సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడిగా రాజిరెడ్డి

శంకరపట్నం, డిసెంబర్ 1: సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడిగా శంకరపట్నం మండలం కొత్తగట్టు గ్రామానికి చెందిన వెల్మరెడ్డి రాజిరెడ్డి మూడోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు రాష్ట్ర నాయకత్వం ఓ ప్రకటన విడుదల చేసింది.

## నూతన కార్యవర్గం ఎన్నిక

తెలంగాణచౌక్, డిసెంబర్ 1: ఆర్టీసీ ఎలక్ట్రిక్ బస్సు (జైభారత్ మారుతి) సంస్థ బస్సు డ్రైవర్ల సంఘం నూతన కార్యవర్గం ఆదివారం ఎన్నికైంది. గౌరవాధ్యక్షుడిగా గీట్ల ముకుందరెడ్డి, అధ్యక్షుడిగా సత్యపాల్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా వినయ్, ప్రధాన కార్యదర్శిగా రాజు, కోశాధికారిగా సంతోష్‌రెడ్డి, ప్రచార కార్యదర్శిగా ప్రసాద్, సంయుక్త కార్యదర్శులుగా రమేశ్, అంజయ్య, సురేందర్‌తో పాటు మరో నలుగురిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.

# మినీ స్టేడియం కోసం ప్రభుత్వాన్ని నిలదీయాలి

కరీంనగర్ బాలికల జట్టుకు బహుమతి అందిస్తున్న ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి

- రూ. 10 కోట్ల నిధులు తెచ్చినా అడ్డుకుంటున్నది
- పట్టణంలో అద్భుతమైన గ్రౌండ్ ఏర్పాటు చేయాలని కన్న కలలపై నీళ్లు చల్లింది
- సర్కారుకు ఏదైనా కోపముంటే నామీద తీర్చుకోవాలి.. క్రీడాకారులపై కాదు
- హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి

హుజూరాబాద్ టౌన్, డిసెంబర్ 1: పట్టణంలో మినీ స్టేడియం కోసం ప్రభుత్వాన్ని, ఇక్కడి కాంగ్రెస్ నాయకులను నిలదీయాలని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి క్రీడాకారులకు సూచించారు. ఒక క్రీడాకారుడిగా తాను, హుజూరాబాద్‌లోని క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో మినీ స్టేడియం ఏర్పాటు చేసేందుకు సకల ప్రయత్నాలు చేసినప్పటికీ, కాంగ్రెస్ అడ్డుకుంటున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం హుజూరాబాద్ ప్రభుత్వ పాఠశాల మైదానంలో రాష్ట్రస్థాయి హాకీ పోటీల ముగింపు వేడుకలకు ఆయన హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఏదైనా కోపం ఉంటే తనమీద తీర్చుకోవాలి తప్ప, క్రీడాకారులపై కాదన్నారు. పట్టణంలో మినీ స్టేడియం కోసం తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఒప్పించి రూ.పది కోట్లు తీసుకువచ్చానని స్పష్టం చేశారు. ఏప్రిల్ 28, 2023లో స్పోర్ట్స్ గ్రౌండ్‌కు 10 కోట్ల రూపాయల టెండర్ కూడా ఇచ్చినట్లు తెలిపారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు మినీ స్టేడియం కోసం అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. మినీ స్టేడియం కోసం తాను 10 కోట్ల రూపాయలు తీసుకువస్తే, కొంతమంది జోకర్లు మైదానం అభివృద్ధి కోసం కేవలం రూ. 10 లక్షలు తెచ్చి గొప్పలు చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. హుజూరాబాద్‌లో అద్భుతమైన గ్రౌండ్ ఏర్పాటు చేయాలని తాను కన్న కలలపై కాంగ్రెస్ ప్రభుత్వం నీళ్లు చల్లిందని విచారం వ్యక్తంచేశారు. ప్రతి క్రీడాకారుడికి, అన్నా అంటే నేనున్నానని స్పందిస్తానని హామీ ఇచ్చారు. హుజూరాబాద్‌లో కూడా హైడ్రా పేరుతో ప్రతాపవాడ, కిందివాడకు సంబంధించి పరిశీలన జరిగినట్లు తెలుస్తున్నదని, ఏదైనా పేదవాడి ఇంటిని కూలగొట్టాలని ప్రయత్నిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. హైడ్రా పేరుతో పేదవాడి ఇంటికి వచ్చి బెదిరిస్తే, తనకు ఒక్క ఫోన్ కాల్ చేస్తే ఏ రాత్రి అయినా సరే వచ్చి మీతోనే ఉంటానని హామీ ఇచ్చారు. తనమీద కాంగ్రెస్ ప్రభుత్వానికి కోపం ఉంటే జైల్లో పెట్టిన పర్వాలేదని, పేదవాడి జోలికి వస్తే మాత్రం ఊరుకోనని హెచ్చరించారు. కార్యక్రమంలో కరీంనగర్ మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి బండ శ్రీనివాస్, మున్సిపల్ చైర్ పర్సన్ గందె రాధిక శ్రీనివాస్, పట్టణాధ్యక్షుడు కొలిపాక శ్రీనివాస్, కౌన్సిలర్లు తాళ్లపల్లి శ్రీనివాస్, హాకీ కోచ్‌లతోపాటు పెద్ద సంఖ్యలో క్రీడాకారులు పాల్గొన్నారు.

***ఎల్లవేళలా ప్రజలకు అండగా ఉంటా***

నియోజకవర్గంలోని ప్రజలకు ఏ సమస్య వచ్చినా ఎమ్మెల్యేగా తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అన్నారు. హుజూరాబాద్ మున్సిపల్ పరిధిలోని పట్టణం, పలు గ్రామాల్లో వివిధ అనారోగ్య సమస్యలతో చికిత్స పొందిన వారి ఇండ్లకు ఆదివారం స్వయంగా వెళ్లిన ఎమ్మెల్యే.. సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. నియోజకవర్గంలో ప్రజలకు ఏవైనా సమస్యలు ఉంటే నేరుగా తనను సంప్రదించాలన్నారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

### అట్టహాసంగా హాకీ పోటీల ముగింపు వేడుకలు

పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో 68వ ఎస్జీఎఫ్ రాష్ట్రస్థాయి అండర్-14 బాలబాలికల హాకీ పోటీల ముగింపు వేడుకలు ఆదివారం అట్టహాసంగా జరిగాయి. ఫైనల్ పోటీల్లో కరీంనగర్ బాలికలు, ఆదిలాబాద్ బాలుర జట్టు గెలిచి, కప్ సాధించాయి. నిజామాబాద్ బాలికల, బాలుర జట్టు రన్నరప్‌గా నిలిచాయి. హుజూరాబాద్ పట్టణానికి చెందిన అవిఘ్న, సహస్ర, మైతీ, మిథున, పర్ణిత, సాయినాథ్, దుర్గరాజు మధ్యప్రదేశ్‌లో జరుగబోయే జాతీయస్థాయి హాకీ పోటీలకు ఎంపికయ్యారు. ముగింపు వేడుకలకు హాజరైన హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, విజేతలకు బహుమతులు ప్రదానం చేయగా, స్థానిక నాయకులు క్రీడాకారులకు ప్రోత్సాహకాలు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, హాకీ క్రీడాకారుల ఆటను చూస్తుంటే తాను క్రికెట్ ఆడిన రోజులు గుర్తుకొస్తున్నాయని పేర్కొన్నారు. హాకీ క్రీడాకారులు ఒలింపిక్స్‌లో మెడల్ సాధించాలని ఆకాంక్షించారు.

## కానిస్టేబుల్ కిష్టయ్యకు నివాళి

సైదాపూర్, డిసెంబర్ 1: మండలకేంద్రంలోని కొత్తబస్టాండ్ వద్ద ఆదివారం తెలంగాణ అమరుడు కానిస్టేబుల్ కిష్టయ్య వర్ధంతిని ముదిరాజ్ మహాసభ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ జిల్లా ఉపాధ్యక్షుడు రాయిశెట్టి చంద్రయ్య, మండలాధ్యక్షుడు రేగుల అశోక్, మండల, యూత్ నాయకులు, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

వీణవంక, డిసెంబర్ 1: మండలంలోని మల్లారెడ్డిపల్లి గ్రామంలో అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తెలంగాణ మలిదశ ఉద్యమ అమరుడు పోలీస్ కిష్టయ్య వర్ధంతి సందర్భంగా ఘనంగా నివాళులర్పించారు. గ్రామస్తులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు గోనెల సమ్మన్న మాట్లాడుతూ, మండల కేంద్రంలో కిష్టయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు, గ్రామస్తులు ముద్దసాని శ్రీనివాస్, గోనెల పెద్దన్న, పూదరి రమేశ్, కొలిపాక రామస్వామి, కొలిపాక శ్రీనివాస్, గంధం లక్ష్మణ్, సుమన్, ప్రశాంత్, సాగర్, బాలస్వామి, నరేశ్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

వీణవంక: మల్లారెడ్డిపల్లిలో చిన్నారులకు పండ్లు పంపిణీ చేస్తున్న గోనెల సమ్మన్న

## రెడ్డి సంఘం అధ్యక్షుడిగా రామకృష్ణారెడ్డి

పీచు రామకృష్ణారెడ్డి

రామడుగు, డిసెంబర్ 1 : గోపాల్‌రావుపేటలో ఆదివారం జరిగిన శ్రీ వీరాంజనేయ రెడ్డి సంఘం ఎన్నికల్లో అధ్యక్షుడిగా పీచు రామకృష్ణారెడ్డి భారీ ఆధిక్యంతో గెలుపొందారు. మొత్తం 198 ఓటర్లు కలిగిన రెడ్డిసంఘం ఎన్నికల్లో ముగ్గురు పోటీ పడగా, పీచు రామకృష్ణారెడ్డి 115 ఓట్లతో విజయం సాధించారు. కర్ర శ్యాంసుందర్ రెడ్డి 59 ఓట్లు, ఒద్దుల హన్మంతరెడ్డికి 9 ఓట్లు వచ్చాయి. కాగా, ఉపాధ్యక్షుడిగా ముదుగంటి రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కర్ర విద్యాసాగర్ రెడ్డి, సహాయ కార్యదర్శిగా చాడ గంగారెడ్డి, కోశాధికారిగా చాడ దామోదర్‌రెడ్డి, కమిటీ సభ్యులుగా ఎడవెల్లి రాజిరెడ్డి, పబ్బతి మల్లారెడ్డి, చాడ హన్మంతరెడ్డి, ఎడవెల్లి మహిపాల్‌రెడ్డి, దాసరి నారాయణరెడ్డి ఎన్నికయ్యారు.

## 'హ్యాట్రిక్' వంశీకృష్ణ

- ముచ్చటగా మూడు ఉద్యోగాలు సాధించిన యువకుడు

జోగు వంశీకృష్ణ

వీణవంక, డిసెంబర్ 1: ఏకంగా మూడు ఉద్యోగాలకు ఎంపికై హ్యాట్రిక్ కొట్టాడు జోగు వంశీకృష్ణ అనే యువకుడు. సాధారణ కుటుంబానికి చెందినప్పటికీ ఉద్యోగాల సాధనలో పట్టువదలని విక్రమార్కుడిలా ముందుకు సాగుతున్నాడు. వీణవంక శ్రీ సరస్వతీ శిశు మందిర్ ప్రధానోపాధ్యాయుడు జోగు మల్లేశం -మాధవి దంపతుల చిన్న కుమారుడైన వంశీకృష్ణ, ఉస్మానియా యూనివర్సిటీలో 2022లో ఎమ్మెస్సీ జియాలజీ పూర్తి చేశాడు. ఉద్యోగ సాధనలో భాగంగా గత సంవత్సరం ఫైర్ ఆఫీసర్‌గా (చొప్పదండి) ఎంపిక కాగా, ఇటీవల విడుదలైన గ్రూప్ 4 ఫలితాల్లో పంచాయతీరాజ్ శాఖ (వరంగల్)లో ఉద్యోగం సాధించాడు. జలవనరుల శాఖలో నోటిఫికేషన్ రాగా, ఇటీవల ఎగ్జామ్ రాశాడు. తాజాగా శనివారం వెలువడిన ఆ ఫలితాల్లో మల్టీజోన్- 1లో రెండో ర్యాంక్ సాధించి, టెక్నికల్ అసిస్టెంట్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. తాను కోరుకున్న ఉద్యోగాన్ని సాధించడంపై వంశీకృష్ణ సంతోషం వ్యక్తం చేశాడు. అతడికి కుటుంబ సభ్యులు, మండల ప్రజలు అభినందనలు తెలిపారు.

## నేటి నుంచి దుబ్బ మల్లన్న ఉత్సవాలు

జమ్మికుంట, డిసెంబర్ 1: మున్సిపల్ పరిధిలోని ధర్మారం శివారులో గల శ్రీ దుబ్బ మల్లికార్జునస్వామి దేవస్థానంలో సోమవారం నుంచి ఉత్సవాలు ప్రారంభంకానున్నాయి. ఉదయం తెల్లవారుజామున 4గంటలకు దృష్టి కుంభం, పెద్దపట్నం, అనంతరం స్వామివారి కల్యాణం జరుగనున్నది. కల్యాణం తర్వాత రథంలో స్వామి వారి ఊరేగింపు నిర్వహిస్తారు. దీనితో జాతర మొదలవుతుంది. జనవరి 14న సంక్రాంతి కార్యక్రమాలు, ఫిబ్రవరి 26న మహా శివరాత్రి జాగారం, మార్చి 23న పెద్దపట్నం, 30న ఉగాది వేడుకలతో కార్యక్రమాలన్నీ ముగుస్తాయి. ఉత్సవాలకు జిల్లాతో పాటు ఇతర జిల్లాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు హాజరవుతారు. భక్తుల సౌకర్యం కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ ఈవో కొండపల్లి సుభద్ర, ఆలయ అర్చకుడు మేడిపల్లి పాపయ్య, ఒగ్గు పూజారులు రాజకొమురయ్య, సదానందం, అయిలయ్య, మల్లేశం, రాజయ్య, తదితరులు తెలిపారు.

## ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా మోహన్

వీణవంకలో ఎన్నికైన ఫొటో, వీడియోగ్రాఫర్ల నూతన కార్యవర్గ సభ్యులు

వీణవంక, డిసెంబర్ 1: మండల ఫొటో, వీడియోగ్రాఫర్ల సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సంగెం మోహన్, గౌరవాధ్యక్షుడిగా ఏలె కుమారస్వామి, ఉపాధ్యక్షులుగా బాలసాని దేవరాజ్, ఉభాది అశోక్, ప్రధాన కార్యదర్శిగా కళ్యాణం రాజు, కోశాధికారిగా గాజుల ప్రవీణ్, ఫొటోగ్రఫీ కుటుంబ భరోసా పథకం ఇన్‌చార్జిగా కర్రె నానీయాదవ్, సలహాదారులుగా శ్యాంకుమార్, దయాకర్, శ్రావణ్‌ను ఎన్నుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## టగ్ ఆఫ్ వార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా కొరిమి సంతోష్

శంకరపట్నం: ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులతో సంతోష్ కుమార్

కొత్తపల్లి/శంకరపట్నం, డిసెంబర్ 1: తెలంగాణ రాష్ట్ర టగ్ ఆఫ్ వార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా శంకరపట్నం మండలం తాడికల్ గ్రామానికి చెందిన కొరిమి సంతోష్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో ఆదివారం జరిగిన తెలంగాణ రాష్ట్ర టగ్ ఆఫ్ వార్ అసోసియేషన్ ఎన్నికల్లో కరీంనగర్ జిల్లా టగ్ ఆఫ్ వార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా ఉన్న కొరిమి సంతోష్‌కుమార్‌ను రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు క్రీడా సంఘాల ప్రతినిధులు అభినందించారు.

వీణవంకలో ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1983-84 బ్యాచ్ విద్యార్థులు

హుజూరాబాద్ టౌన్: ఆత్మీయ సమ్మేళనంలో గురువును సన్మానిస్తున్న ఉషోదయ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాలు

వీణవంక, డిసెంబర్ 1: వీణవంక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1983-84లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. 40 వసంతాల తర్వాత ఒక్కచోట కలిసిన వారు, చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఆడిపాడి సందడి చేశారు. గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హుజూరాబాద్ టౌన్, డిసెంబర్ 1: పట్టణానికి చెందిన ఉషోదయ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు (1999-2000 బ్యాచ్ పదో తరగతి) ఆదివారం పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. 25 సంవత్సరాల క్రితం జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. ఆటపాటలతో సందడి చేశారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉషోదయ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మండల వీరస్వామి, ఉపాధ్యాయులు గోపాల్, మొగులయ్య, సదానందం, శ్రీనివాస్, సత్యనారాయణ, రమేశ్ బాబు, కుమారస్వామితో పాటు పూర్వ విద్యార్థులు లిలిన్ చంద్, ప్రకాశ్ రెడ్డి, కమలాకర్, సతీశ్, షరీఫ్, కిరణ్ ప్రసాద్, రాజు, శ్రీను, కుమార స్వామి, శ్రీలత, వనిత, స్వరూప, అరుణ, సునీత, మాధవి, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## రేకుర్తి కంటి హాస్పిటల్ సేవలు భేష్

రేకుర్తి కంటి దవాఖానను సందర్శించిన లయన్స్ క్లబ్ గవర్నర్ వెంకటేశ్వర్‌రావు, సభ్యులు

విద్యానగర్, డిసెంబర్ 1 : లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ జిల్లా గవర్నర్ లయన్ నడిపల్లి వెంకటేశ్వర్ రావు ఆదివారం రేకుర్తి కంటి హాస్పిటల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా హాస్పిటల్‌లోని పలు విభాగాలను సందర్శించి, నిర్వహణ తీరును అభినందించారు. దవాఖాన శుభ్రతను మెచ్చుకున్నారు. హాస్పిటల్ అభివృద్ధికి తన వంతుగా సహకరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో హాస్పిటల్ చైర్మన్ కొండ వేణుమూర్తి, ప్రకాశ్ హోల్లా, కోల అన్నారెడ్డి, సింగంరాజు, క్లబ్ అధ్యక్షులు ముక్క శరత్, శివకాంత్, బట్టు వినోద్ ఇతర సభ్యులు పాల్గొన్నారు.

## 'మాదిగ జాతికి సీఎం రేవంత్ ద్రోహం'

జమ్మికుంట, డిసెంబర్ 1: ఎస్సీ వర్గీకరణ చేయకుండా మాదిగ జాతికి సీఎం రేవంత్ ద్రోహం చేస్తున్నాడని, ఎస్సీ వర్గీకరణ కోసం మాదిగ ప్రజలు మరో ఉద్యమానికి సిద్ధం కావాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి అనిల్, ఎమ్మెస్పీ రాష్ట్ర కో-ఆర్డినేటర్ ఇంజం వెంకటస్వామి పిలుపునిచ్చారు. ఆదివారం మండల ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల సమీక్షా సమావేశం తునికి వసంత్ అధ్యక్షతన జమ్మికుంటలో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా నాయకులు అనిల్, వెంకటస్వామి హాజరై మాట్లాడుతూ.. మాలల ఒత్తిడికి తొగ్గిన సీఎం వర్గీకరణ అమలులో జాప్యం చేయడం తగదన్నారు. వర్గీకరణ అమలు వంద రోజుల్లోనే చేస్తానని అసెంబ్లీలో ప్రకటించిన రేవంత్, ఇచ్చిన మాట నిలబెట్టుకోవడంలో విఫలమయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వర్గీకరణపై వ్యతిరేకంగా మాట్లాడుతున్న కాంగ్రెస్ ఎమ్మెల్యేలను ఎందుకు సస్పెండ్ చేయడంలేదో చెప్పాలని డిమాండ్ చేశారు. వర్గీకరణ జరిగేంత వరకు నియామకాలు నిలిపి వేయాలన్నారు. వర్గీకరణ కోసం పోరాటానికి సిద్ధమవుతున్నామని హెచ్చరించారు. ఇక్కడ రాంచందర్, శ్రీనివాస్, సాగర్, ఆదిత్య, రాజు, స్వర్ణకుమార్, సమ్మన్న, అనిల్, గణపతి, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఆంగ్ల డిక్షనరీల వితరణ

విద్యార్థినులకు డిక్షనరీలు అందిస్తున్న లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్, సభ్యులు

మానకొండూర్ రూరల్, డిసెంబర్ 1: పచ్చునూర్ జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు కరీంనగర్ లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ వెంకటేశ్వర్ రావు, సింగమ రాజు ఆధ్వర్యంలో ఆంగ్ల డిక్షనరీలు వితరణ చేశారు. పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం పోరెడ్డి దామోదర్ రెడ్డి, ఆంగ్ల ఉపాధ్యాయుడి విజ్ఞప్తి మేరకు 6 నుంచి 10వ తరగతి చదువుతున్న దాదాపు 130 మంది విద్యార్థులకు ఆంగ్ల నిఘంటువులు సమకూర్చారు. ఆదివారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వాటిని మండల విద్యాధికారి మధుసూదనాచారితో కలిసి విద్యార్థులకు పంపిణీ చేశారు. విద్యార్థుల అవసరాలను గుర్తించి, డిక్షనరీలు అందజేసినందుకు వారిని మండల విద్యాధికారి అభినందించారు. విద్యార్థులు డిక్షనరీలను వినియోగించుకొని పాఠశాలకు పేరు తీసుకురావాలని సూచించారు. అలాగే, పాఠశాలకు శుద్ధ జల ప్లాంట్‌ను అందించనున్నట్లు లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ వెంకటేశ్వర్ రావు ప్రకటించారు. అనంతరం పాఠశాల అభివృద్ధికి పాటుపడుతున్న ఇన్‌చార్జి హెచ్ఎం పోరెడ్డి దామోదర్‌రెడ్డిని క్లబ్ సభ్యులు, ఉపాధ్యాయులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు చిదుర సురేశ్, రాంబాబు, సుధాకర్ రెడ్డి, ముక్క శరత్, ఉపాధ్యాయులు సురేందర్, రవీందర్, దివాకర్, అబ్దుల్ వలీ, శ్రీనివాస్, శ్రీధర్, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎస్సీ వర్గీకరణ ప్రయత్నాలను మానుకోవాలి

మాల మహానాడు సింహగర్జనకు బయలుదేరుతున్న నాయకులు

హుజూరాబాద్ టౌన్, డిసెంబర్ 1: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ వర్గీకరణ ప్రయత్నాలను మానుకోవాలని మాల మహానాడు నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన మాల మహానాడు సింహ గర్జనకు నియోజకవర్గం నుంచి తరలి వెళ్లారు. ఈ సందర్భంగా మాల మహానాడు నాయకులు పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, విలేకరులతో మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగానే కాకుండా, దళితుల ఐక్యత కోసం మాల మహానాడు కృషి చేస్తున్నదన్నారు. వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకోకుండా ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సీఎం రేవంత్ రెడ్డి ప్రకటన చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఓట్లు వేసి కాంగ్రెస్‌ను గెలిపిస్తే ఇప్పుడు మాలలకు అన్యాయం చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఇకనైనా వర్గీకరణ ప్రయత్నాలు విరమించుకోకపోతే కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని రేవంత్ రెడ్డి ప్రభుత్వం మాలల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. మాలల ఐక్యతతోనే ఎస్సీ వర్గీకరణకు చరమగీతం పాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు సొల్లు బాబు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ తొగరు స్వామి, రాష్ట్ర కార్యదర్శి పసుల స్వామి, మాల మహానాడు ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు పాక సతీశ్, భోగం దశరథం, తొగరు బుచ్చయ్య, జూపాక శ్రీనివాస్, కాయిత రాములు, వేముల పుష్పలత, సొల్లు సునీత, తొగరు భిక్షపతి, బత్తుల సమ్మన్న, కొడిగుటి ప్రవీణ్, సిరిమల రాజు, కత్తరమల సదానందం, పోతుల సంజీవ్, ఎడ్ల బక్కయ్య, ఎడ్ల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## మాల సింహగర్జన మహాసభకు తరలిన నాయకులు

మానకొండూర్, డిసెంబర్ 1: మాల మహానాడు ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో తలపెట్టిన మాల సింహగర్జన మహాసభకు ఆదివారం మానకొండూర్ మండలం నుంచి అధిక సంఖ్యలో మాల కులస్తులు తరలి వెళ్లారు. కార్యక్రమంలో సంఘం మండలాధ్యక్షుడు బొల్లం వెంకటస్వామి, నాయకులు వేల్పుల రాములు, ఉండింటి అశోక్, తడకపెల్లి నారాయణ, ఉండింటి శ్యాంసన్, గంజి శ్రీనివాస్, ఉండింటి ప్రశాంత్, బొల్లం సంతోష్ తదితరులు ఉన్నారు.

## బీఆర్ఎస్ నాయకుడి కుటుంబానికి పరామర్శ

చిగురుమామిడి, డిసెంబర్ 1: మండలంలోని నవాబుపేట్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు, మాజీ వార్డు సభ్యుడు కూతురు శ్రీపతి రెడ్డి మృతి చెందగా, మృతదేహాన్ని హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్ రెడ్డి సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట నాయకులు ఉన్నారు.

## డిపో-1లో వనభోజనాలు

తెలంగాణచౌక్, డిసెంబర్ 1: నగరంలోని బస్టాండ్ ఆవరణలోని డిపో-1లో ఉద్యోగులకు ఆదివారం వనభోజనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఆటలు, పాటల పోటీల్లో ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇక్కడ డిప్యూటీ ఆర్ఎం సత్యనారాయణ, డీఎం విజయమాధురి, అసిస్టెంట్ డీఎం హిమబిందు, సిబ్బంది ఉన్నారు.

## శిథిలావస్థకు చేరిన భవనం కూల్చివేత

కార్పొరేషన్, డిసెంబర్ 1: నగరంలోని వన్ టౌన్ పోలీస్ స్టేషన్ వెనుక గల త్యాగరాజ కళాపరిషత్ భవనం శిథిలావస్థకు చేరగా, ఆదివారం ఉదయం రెవెన్యూ మున్సిపల్ అధికారులు కలిసి కూల్చివేశారు. ప్రభుత్వ స్థలంలో ఉన్న ఈ భవనం శిథిలావస్థకు చేరడంతో అధికారులు కూల్చివేయించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ, బల్దియా అధికారులు పాల్గొన్నారు.